

# పసిడిమనసులు - షర్మిల



## సారు గారి వీరగాధ

**కాకరకాయని** చూసినప్పుడల్లా నాకో కుటుంబం గుర్తొస్తుంది. నేను చెప్పే కథలో ధర్మలింగం గారి కుటుంబానికీ కాకరకాయకీ వున్న సంబంధమల్లా ఒకటే. ఆ ఇంట్లో వున్న మనుషులకు కాకరకాయ కూరంటే ప్రాణం. ఎంత ప్రాణం అంటే వాళ్ల కాకర పాదుకి రెండు కాయలు కాస్తే ఎవరికి దొరికినా వాళ్లు నాలుగు వుల్లిపాయలు కోసేసుకుని కూరొండుకునేం.

ఇక ధర్మలింగం గారు ఎవరు? ఆ కథా కమామీషు ఏంటంటారా !

వస్తున్నా ...

మేము విశాఖపట్నం మర్రిపాలెంలో వుండే వాళ్లం. మా ఇంటి ఎదురుగా పేద్ద మైదానంలో ఎక్కడో రెండు మూడు ఎం.ఈ.ఎస్ క్వార్టర్లుండేవి. ఆ క్వార్టర్లలో ధర్మలింగం గారి కుటుంబం వుండేది. ధర్మలింగం గారు తమిళులు. మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ( ఎం.ఇ. ఎస్ ) లో పనిచేసేవారు .

ఆయన కూతుర్లు ట్యూషన్ చెప్తారంట అనే కబురు ఆ మైదానంలో క్రికెట్ ఆడుకునే మా తమ్ముళ్లు ఏసుకొచ్చారు.

అసలు మా వూరి నుంచి విశాఖపట్నం వచ్చానేగానీ నాకు నేను చదివే మిషనరీ స్కూల్ పెద్దగా నచ్చలేదు.

నేను ఒక రోజు స్కూల్ కి ఆలస్యంగా వెళ్లాను. మా హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ ఫిలిప్పా బెత్తం పట్టుకుని నుంచుని వుంది.

ఆమెది కేరళ. నన్ను కోరగా చూస్తూ "ఏం పిళ్లా ( పిల్లా ) ఆలస్యంగా వచ్చావ్ ? చెయ్యి చాపు" అంది.

అసలే పల్లెటూరు నుంచి ఫ్రెష్ గా ఎళ్లానేమో బయ్యం లేకుండా ఆవిడ కళ్లలోకి చూస్తూ "బస్ లు ఆపలేదు అందుకే లేట్" అన్నా.

ఆ రోజుల్లో కొన్నాళ్లు కెపాసిటీ అని పదిమందికి మించి బస్**లో** నిలబడి వుంటే ఆ బస్ ఆపేవారు కాదు .

నా మాటకి ఆవిడ కోపంతో వూగిపోతూ "కళ్లు దించు" అని ఒక్క అరుపు అరిచింది. సిస్టర్ ఫిలిప్పాకి తలెత్తి సమాధానం ఇచ్చేపాటిది ఇదెవరా ! అని పక్కన పిల్లలు నా వంకే చూస్తున్నారు.

చెయ్యి చాపమని బెత్తంతో రెండు దెబ్బలేసింది. పుట్టాక అంత మాత్రం దెబ్బలు ఎప్పుడూ తినలేదు. నన్ను మా వూళ్లో మాస్టర్లు కూడా ముద్దుగా చూసేవారు.

క్లాస్ కి వెళ్లాక హోం వర్క్ బుక్స్ ఇవ్వమని మా మనోహరం టీచర్ అడిగితే నేను లేచి నుంచుని "ఇంటికాడ మర్చి పోయా" అనంగానే పిల్లలంతా ఒకటే నవ్వు.

నేను అయోమయ్యంగా చూస్తాంటే టీచర్ నవ్వు ఆపుకుంటా "ఇంటి కాడ అనకూడదు ... ఇంటి దగ్గర అనాలి" అని చెప్పినప్పటినుంచి నేను యాసగా మాట్లాడుతున్నానని అర్థమైంది.

అట్టా ఇట్టా అనడం మానేసి అలా ఇలా అనడం మొదలెట్టాను.

మా వూళ్లో పులిలాగా తిరిగే నేను విశాఖపట్నంలో పిల్లిలా వుండేదాన్ని. పైగా అలవాటు లేని అమ్మా నాన్నలు , కొత్త వూరు ...

బాగా చదివేదాన్నల్లా లెక్కల్లో తప్పడం మొదలెట్టా.

అప్పటికీ మా మాస్టార్లు మొత్తుకున్నారు నువ్వు వైజాగ్ వెళ్లొద్దో అని. ఇంకో పక్క మాన్నాన్న గోల చేశాడు ఎళ్లమాక అని ... అబ్బే నేను ఆ మాటలే ఇని వుంటే ఈ తిప్పలెందుకూ !

లెక్కలు అర్థం కావడంలేదని ట్యూషన్ చదువుతానన్నా. అందుకే ఆ అరవ టీచర్ల దగ్గర ట్యూషన్ మాట్టాడుకుందామని తమ్ముళ్లిద్దర్నీ తీసుకుని బయల్దేరా.

తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగి పోయి వున్న మైదానంలో నున్నగా మారిన కాలి బాట గుండా మేం ముగ్గురం బయల్దేరాం.

ధర్మలింగం అని బోర్డ్ రాసివున్న క్వార్టర్లో అడుగు పెట్టాం.

ఎవరిల్లయినా గోల గోలగా వుంటే మా వూళ్లో ఇల్లా అది సత్రమా అంటారు. వైజాగ్ లో మాత్రం “పూర్ణా మార్కెట్ లాగా ఏటి ఈ గోస” అంటారు.

నాకు ఆ ఇల్లు చూస్తే సత్రమూ, పూర్ణా మార్కెట్ రెండూ గుర్తొచ్చాయి. ఎటు చూసినా పిల్లా మేకా తిరుగుతున్నారు. మమ్మల్ని చూసి బయటకి ఒకామె వచ్చి ఏమిటన్నట్టు చూసింది. ఇక్కడ ప్రైవేట్లు చెప్తారంట, మేం ముగ్గురం చేరదామని వచ్చామన్నాం.

మేము ఎక్కడవుండేది అడిగి రేపటి నుంచి రమ్మని చెప్పారు.

ధర్మలింగం గారికి ఏడుగురు సంతానం .

నలుగురు ఆడపిల్లల , ముగ్గురు మగపిల్లలు, పెద్దమ్మాయికి పెళ్లి అయి మద్రాస్ లో వుందంట.

ఆమె కొడుకు కూడా ఇక్కడే, పైగా ఆయన అన్న కొడుకు వుద్యోగానికి వచ్చి వీళ్లింట్లోనే.

మొత్తం పదిమందితో ఆ ఇల్లు నిండిపోయి వుండేది.

మాకు చదువు సంగతేమోగానీ ధర్మలింగం గారి కబుర్లు ఆయన సాహసాలు వినడంతోనే సరిపోయేది. ఆయనని మేం సార్ గారు అనేవాళ్లం. ఐదడుగుల ఎత్తు బాన పొట్టమీదకి లుంగీ మీసాలతో వున్న సారు గారు తన వీరగాధల్లో ఒకప్పుడు పాకిస్తాన్ విశాఖపట్నం సంద్రంలోకి పంపిన సబ్ మెరీన్ ఘాజీ మీద నేవల్ వాళ్ల దాడి గురించి ఎక్కువ వుండేది.

ఆ ఘాజీ లో దొరికిన ఒక చెక్క కూడా చూపించేవారు.

సార్ గారి ఆవిడకి ఈ పది మందికీ వండిపెట్టడమే పని. బక్కగా వుండే ఆమె అంత పని చేస్తున్నా చిరునవ్వుతోనే కనిపించేది.

మాకు చదువు చెప్పే టీచర్లు ముగ్గురు. కమల, సరోజిని, లక్ష్మి మిగతా వాళ్లు మోహన్, కుమ్మి, కీచా. ఒకళ్లో అరో తప్ప అందరూ బక్కగా వుండే వారు. అందరిలోకి అందంగా వుండేది లక్ష్మి .

ఒక రోజు ఆమెతో కలిసి ఆ మైదానంలో నడుస్తున్నా.

ఎదురుగా ఒక కుర్రాడు బైక్ మీద వెళ్తుంటే నాకు చూపించి “బాగుంటాడు కదా” అంది. అతని గురించి మా వీధిలో చాలా మంది ఆడపిల్లలు మాట్టాడుకోవడం విన్నా. వాడి వైపే ఆరాధనగా చూసింది లక్ష్మీ టీచర్.

ప్రైవేటు అని వెళ్లి కబుర్లతో కాలక్షేపం చేస్తున్నామని మా మార్కులు చూస్తే ఇంట్లో అర్థమైంది.

అప్పటికే మేం చేరి మూడు నెలలైంది. ఇక ట్యూషన్ మానేస్తామని చెప్పెయ్యమన్నారు ఇంట్లో.

కానీ ఎందుకో సారు గారినీ ఆ కుటుంబాన్నీ వదలాలనిపించలేదు.

మేం వచ్చే ఆఖరి రోజున సారు గారి కుటుంబమంతా బయటకి వచ్చి సాగనంపారు.

మేం ఆ తర్వాత ఇల్లు మారిపోయాం .

వైజాగ్ పెరిగిపోయాక ఆ మైదానంలో క్వార్టర్లు పడగొట్టి ఎన్నో అంతస్తుల నేవల్ క్వార్టర్లు కట్టారు.

చాలా ఏళ్ల తరవాత కీచా కనిపించాడు. సార్ గారు ఘాజీ వీరగాధ లాగానే అయన జీవితంలోనూ విజయం సాధించారు. పిల్లలు గవర్నమెంట్ వుద్యోగాలు సంపాదించారు.

పెళ్లిల్లు చేసుకుని స్థిరపడ్డారు.

కానీ అందమైన లక్ష్మీ టీచర్ మేం వచ్చేసిన కొన్నిరోజుల్లోనే బ్రెయిన్ ట్యూమర్ తో చనిపోయిందని కీచా చెప్పాడు.

లక్ష్మీ టీచర్ ఆ కుర్రాడి వంక ఆరాధనగా చూసిన చూపులు, ఆమె కళ్లల్లో మెరిసిన మెరుపులు గుర్తొచ్చాయి .

అర్ధంతరంగా బుగ్గిపాలైన ఆమె అందమైన రూపం గుర్తొచ్చింది

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments